ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 23 మే 2025

బలం.. బలగం కార్యకర్తలే



'తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలే. వారి కష్టమే లేకపోతే నేడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేవాళ్లం కాదు. మేము ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యే వాళ్లం కాదు. కార్యకర్తలను వెన్నంటి కాపాడటమే మా లక్ష్యం. వారి కష్ట సుఖాల్లో తోడుగా ఉంటాం..'

- బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి



హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు



'వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం నాశనమైంది. అరాచక పాలన సాగించిన వైసీపీని ప్రజలే దూరం పెట్టారు. ఐదేళ్లలో నష్టపోయిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దూసుకెళ్తోంది. కష్టకాలంలో శ్రమించిన కార్యకర్తలకే పదవులు దక్కుతాయి'

-ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి

- వైసీపీ పాలనంతా అరాచకమే : మంత్రి బీసీ
- నేడు సంక్షేమ పాలన : మంత్రి ఫరూక్
- శ్రమించిన కార్యకర్తలకే పదవులు
- కడప మహానాడుకు తరలిరండి
- టీడీపీ శ్రేణులకు నేతల పిలుపు
- నంద్యాలలో ఘనంగా జిల్లా మహానాడు



నంద్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ కొనియాడారు. అలాంటి టీడీపీకి కార్యకర్తలు వెన్నెముక లాంటివారన్నారు. గురువారం నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో జిల్లాస్థాయి మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇద్దరు మంత్రులతో పాటు జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిల ప్రియ, గౌరు చరిత, గిత్తా జయసూర్య తదితర కీలక నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి



పూలమాలలు వేసి నివాళులర్పించి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడుతో మోసం చేయడం.. రూ.లక్షల కోట్లు అప్పు చేయడమే లక్ష్యంగా పాలన సాగిందని విమర్శించారు. ఎక్కడ చూసిన దౌర్జన్యకాండ సృష్టించి బడుగు, బలహీన వర్గాలను నిలువు దోపిడీ చేసిందన్నారు. కానీ టీడీపీ ఎప్పటికి బడుగు, బలహీన వర్గాలను అండగా పేదల అభివృద్ధి, సంక్షేమమే దిశగా కృషి చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నిత్యం పేదల కోసం పరితపిస్తారని కొనియాడారు. అవినీతి లేని, ఎలాంటి మచ్చలేని సీఎం చంద్రబాబును అర్ధరాత్రి సమయంలో నంద్యాల పట్టణంలో వైసీపీ అరెస్ట్ చేసినప్పటికి కార్యకర్తలు ఏమాత్రం బెదరకుండా పార్టీ కోసం శ్రమించారన్నారు. వైసీపీ అరాచకాలకు పాల్పడితే.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తోందన్నారు.

మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు సూపర్-6 హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, దీపం-2, తల్లికి వందనం తదితర వాటిపై క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతిపక్షంలో శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తించి త్వరలోనే పదవులు కల్పిస్తుందన్నారు. హైదరాబాదు తరహాలో అమరావతిని రూపుదిద్దాలని చంద్రబాబు ఆలోచించారన్నారు. కానీ 2019లో జగన్ అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాటు రాజధాని అమరావతిని నాశనం చేశాడన్నారు. రూ.10 లక్షలు కోట్లు అప్పు చేసి ప్రజలపై భారం మోపిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. ఈనెలలో కడపలో నిర్వహించే మహానాడును జిల్లా నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చివరగా కీలక అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కొనతల రామకృష్ణ, తెలుగుగంగ, కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్లు సంజీవ కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, సివిల్ సప్లై సభ్యులు నరహరి విశ్వనాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జిల్లెల శ్రీరాములు, రామచంద్రరావు, వెంకటస్వామి, రామకృష్ణారెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, మాజీ ఆర్‌ఐసీసీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ నాయకులు నాగేశ్వరావు, మహేశ్వరనాయుడు, రామాంజినాయక్, జమ్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు : జిల్లా స్థాయి మహానాడు నేపథ్యంలో డీఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సీఐలు, ఎస్ఐలు, తదితర సిబ్బంది ఉదయం నుంచే టెక్కె మార్కెట్‌యార్డు ప్రాంగణం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డీఎస్పీ పర్యవేక్షించారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు


టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

● కడపలో మహానాడు సత్తా



గతంలో జరిగిన మహానాడు వేదికలు ఒక ఎత్తు.. ఈసారి కడపలో జరిగే మహానాడు మరో ఎత్తు. ప్రత్యర్థి వైఎస్ జగన్ కంచుకోటను బద్దలు కొట్టి అక్కడ మహానాడు నిర్వహించడం గర్వంగా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏ ఒక్కరిని అడిగినా చెబుతారు. ఎంపీ స్థాయిలో నేషనల్ హైవేస్, ఓవర్ బ్రిడ్జిలు, రైల్వేలైన్లు, ఎయిర్‌వేస్ తదితర పనులు చేయిస్తున్నాం. కర్నూలుతో పోలిస్తే నంద్యాలనే చాలా బాగుందని ప్రజలు చెబుతున్నారు.

- బైరెడ్డి శబరి, ఎంపీ

కష్టపడ్డ వారికి గుర్తింపు



క్షేత్ర స్థాయిలో కష్టపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ శ్రేణులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలందరికి ప్రభుత్వం ఏదో ఒక రూపంలో పదవులు కల్పించాలి. ఆ దిశగా మంత్రులు కూడా సహకరించాలి. ఒక్కఅవకాశం పేరుతో ముద్దులు పెట్టి మరీ జగన్ సీఎం అయ్యారు. ఆ తర్వాత ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేశాడు. దీని ఫలితమే 2024 ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు వచ్చేలా చేసింది.

- బుడ్డా రాజశేఖర్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే

మహానాడుతో పండుగ



టీడీపీ నిర్వహించే మహానాడుతో పండగ వాతావరణం లాం టిది. గత ఐదేళ్లలో నాయకులు, కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారు. వైసీపీ కక్షసాధింపుతో అక్రమ కేసులు పెట్టి బెదిరిం చారు. ఏమాత్రం బెదరకుండా కూటమిని గెలిపించారు. ఏనాడైతే చంద్రబాబును అరెస్ట్ చేశారో.. ఆరోజే వైసీపీ పతనం ప్రారంభమైంది. కడపలో జరిగే మహానాడుకు తరలివచ్చి విజయవంతం చేయాలి.

- భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

గ్రామ స్థాయి నుంచి తరలిరండి



కడపలో నిర్వహించే మహానాడుకు గ్రామస్థాయి నుంచి టీడీపీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలి. 2019 నుంచి 2024 వరకు కష్టపడిన ప్రతి కార్యకర్తకూ వచ్చే లోకల్‌బాడీ ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ తదితర వాటిలో అవకాశం కల్పించాలి. అదేవిధంగా నామినేటెడ్ పదవుల్లో కూడా అవకాశం కల్పించాలి.

- గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు

టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు



ఎన్ని కష్టాలు వచ్చినా..ఎంతమంది నాయకులు మారినా.. టీడీపీ కార్యకర్తలు మాత్రం మారలేదు. ఏ పార్టీకి లేని కార్యకర్తలు టీడీపీకి వెన్నంటి ఉన్నారు. పార్టీకి వారే మూల స్తంభాలు. వైసీపీ పాలనలో కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. కానీ బెదరలేదు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై వైసీపీ కేసు నమోదు చేసింది. అయినా ఆయన బెదరలేదు. చంద్రబాబును 52 రోజుల పాటు జైల్లో పెట్టడంతో రాష్ట్ర ప్రజలు కన్నెర్ర చేసి 2024 ఎన్నికల్లో వైసీపీ తగిన బుద్ధి చెప్పారు. అలగనూరు రిజర్వాయరు, గోరకల్లు రిజర్వాయర్‌ను వైసీపీ పూర్తిగా నాశనం చేసింది. ఆ ప్రాజెక్టులపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు.

- గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం

పది పరీక్షలకు
678 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో గురువారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 678 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 35 పరీక్షా కేంద్రాల్లో గురువారం జరిగిన గణితం పరీక్షకు 3856 మంది విద్యార్థులకు గాను 3178 మంది విద్యార్థులు హాజరయ్యారని, 678 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో(ఓపన్ స్కూల్ పరీక్షలు)భాగంగా 4 కేంద్రాల్లో నిర్వహించిన గణితం, భారతీయ సంస్కృతి పరీక్షకు 305 మంది విద్యార్థులకు 268 మంది విద్యార్థులు హాజరు కాగా 37 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల్లో భౌతికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం పరీక్షలను రెండు కేంద్రాల్లో నిర్వహించగా 165 మంది విద్యార్థులకు గాను 145 మంది విద్యార్థులు హాజరయ్యారని, 14 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్ పరీక్షకు 35మంది...

నంద్యాల ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకు గురువారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 543 మంది విద్యార్థులకు గాను 528 మంది విద్యార్థులు హాజరుకాగా 15మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 543 మంది విద్యార్థులకు గాను 523 మంది విద్యార్థులు హాజరు కాగా 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు సెషన్స్‌లో కలిపి 1086 మంది విద్యార్థులకు గాను 1051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 35మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 96.78శాతం హాజరు నమోదైంది.

యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలి

- అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- నాలుగు పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర
- జూన్ 16న ఐదువేల మంది విద్యార్థులతో కార్యక్రమం
- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాకు ప్రజలు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో యోగా ఆంధ్ర-2025 కార్యక్రమాల అమలుపై ఎంపీడీ వోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లతో వీసీలో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆరోగ్యపరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించిందన్నారు. జిల్లా నుంచి గుర్తించిన యోగా గురువులు, శిక్షకులకు డిల్లీలోని మొరార్జీ దేశాయ్ యోగా ఇన్‌స్టిట్యూట్ నుంచి శిక్షణ ఇస్తారని, శిక్షణ పొందిన శిక్షకులు మండల స్థాయిలో 200మందికి శిక్షణ ఇస్తారని చెప్పారు. నాలుగు పర్యా టక ప్రాంతాల్లో కూడా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని అందులో శ్రీశైల దేవస్థాన ప్రాంగణంలో మే 31న, మహానందిలో జూన్ 7న, బెలూం గుహలవద్ద జూన్ 13న, పచ్చర్ల జంగిల్‌క్యాంప్‌లో జూన్ 20న యోగా నిర్వహణ కార్యక్రమాలకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో జూన్ 16న ఐదు వేలమంది విద్యార్థులతో యోగా కార్యక్రమం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్ష

నంద్యాల నూనెపల్లె : రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పౌర సేవలు, సంక్షేమ పథ కాలపై ప్రజాభిప్రాయ సేకరణలో లోపాలను సరిదిద్దాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రజాభిప్రాయ సేకరణపై మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆమె వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇంటింటి చెత్తసే కరణపై దృష్టిసారించాలని, దీపం పథకం కింద ఇళ్లకు చేరవేసే గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరకే చెల్లిస్తున్నారా లేక డెలివరి బాయ్స్ అధికంగా వసూలు చేస్తున్నారా అనే అంశాలపై పర్యవేక్షించాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

- ఎక్సైజ్ పోలీసుల ఉక్కుపాదం
- 392 మంది బైండోవర్
- 250మంది సారా విక్రేతల అరెస్టు
- 4198 లీటర్ల సారా, 1365 కేజీల బెల్లం స్వాధీనం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్



నంద్యాల, మే22(ఆంధ్రజ్యోతి): 'నవోదయం-2.0'లో సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రవికుమార్ తెలిపారు. ఈమేరకు జిల్లా ఎక్సైజ్ పోలీసులు సారాపై ఉక్కుపాదం మోపారు. ఎక్కడిక్కడ సారా తయారీ, సారా విక్రేతలపై ప్రత్యేక ఆయాప్రాంతాల ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసి కొరడా ఝుళిపిస్తున్నారు. గురువారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రవికుమార్ వివరాలు వెల్లడించారు. ఈఏడాది ఫిబ్రవరి 2వ తేదీన నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టగా జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటివరకు సారాకు వినియోగించే బెల్లం సరఫరా చేసే 392మంది గుర్తించి ఆయా తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశారు. 250మంది సారా విక్రేతలను అరెస్ట్‌చేసి 222 కేసులు నమోదు చేయడంతో పాటు 4198 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీచేసే బట్టీలపై దాడులుచేసి 53,563 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 1365 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతినెల 4వ శనివారం ఆయా సీఐల పరిధిలో మద్యం విముక్తి-వాటి పర్యవసనాలపై కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పి స్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా సారా తయారుచేసినా, అమ్మినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్వర్ కష్టాలు

- రేషన్‌కార్డు దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు
- ఇబ్బందిపడుతున్న దరఖాస్తుదారులు



నంద్యాల నూనెపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులకు కూటమి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించినప్పటికీ సర్వర్ సమస్య పరీక్ష పెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రామాణికంగా కొత్తకార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఆధార్ నెంబర్లతో వలంటీర్లు మ్యాపింగ్ ప్రక్రియ చేశారు. అందులో తప్పులు దొర్లుతుండటంతో ప్రస్తుతం కొత్త జంటలు దరఖాస్తు చేయడానికి ఇబ్బందిపడుతున్నారు. ఓ వైపు పౌరసరఫరాలశాఖ వెబ్‌సైట్ అందుబాటులోకి రాకపోవడం మరోవైపు సచివాలయ సిబ్బంది తమ పరిధికాదని చెబుతుండటంతో కార్డు రాదేమోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏళ్లతరబడి కొత్తకార్డులు మంజూరు చేయలేదు. దీంతో కార్డు కావాల్సినవారు తప్పులు సవరణ కోరుకుంటున్నారు. చిరునామా మార్పు, ఆధార్ సంఖ్య సవరణకు చాలామంది సచివాలయాలకు తరలివస్తున్నారు. మే 7వ తేదీనుంచి ప్రారంభమైన నూతన రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ మూడు, నాలుగు రోజులు సవ్యంగా సాగినప్పటికీ దరఖాస్తుచేసుకునేవారు అధికసంఖ్యలో ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఇప్పటి వరకు జిల్లాలో 20వేల వరకు నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తులు వచ్చాయని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఇవీ ఇబ్బందులు

- కార్డులో ఆధార్ తప్పుగా మ్యాపింగ్ అయితే సరిచేసేందుకు ఆప్షన్ ఇవ్వలేదు.
- మార్పులు, చేర్పులకు సంబంధించి 15సంవత్సరాల్లోపు పిల్లలకు మాత్రమే అవకాశం ఇచ్చారు. 15ఏళ్లకు మించిన పిల్లలను కూడా చేర్చేందుకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ ఉంది.
- ఆదాయపు పన్ను చెల్లించడంలేదని సంబంధిత శాఖ నుంచి పత్రాలు తీసుకువచ్చినా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు.
- పెళ్లి అయి ఇతర రాష్ట్రాలకు వెళ్లినవారిని కార్డులో నుంచి తొలగించేందుకు ఆప్షన్ ఇవ్వలేదు. కేవలం చనిపోయినవారి పేర్లు తొలగించేందుకే అవకాశం కల్పించినా సభ్యుల ఈకేవైసీని సిస్టం తీసుకోవడం లేదు.
- సింగిల్ కార్డుకు 40నుంచి 50ఏళ్ల వయసున్నవారికి అవకాశం ఇచ్చారు. 50ఏళ్లకు పైబడినవారు దరఖాస్తుచేయడానికి వీల్లేకుండా పోయింది.
- రేషన్‌కార్డులో తప్పుగా నమోదైన కుటుంబసభ్యుల సంబంధాల్లో సరిచేసుకోవాలన్నా కార్డులోంచి తొలగించాలన్నా ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ పొందుపరచలేదు.

చట్టాలపై అవగాహనతోనే న్యాయవాద వృత్తిలో రాణింపు
హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ 6

సంప్రదాయాల లొల్లి.. ఆగిన పెళ్లి
● నిశ్చితార్థం రోజే పెళ్లికొడుకు ఆత్మహత్యాయత్నం
● చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి 7



వంద శాతం వారికే..

రైతులు, పొదుపు మహిళలు, దివ్యాంగులకు చోటు

- ఒత్తిళ్లు, సిఫారసులకు అవకాశం లేనట్టే
- ఊపిరి పీల్చుకుంటున్న అధికారులు, సిబ్బంది
- రూ.6కోట్ల విస్తరణ పనులు
- సకాలంలో పూర్తి చేయాలని ఆదేశం
- పని కోల్పోయిన వారికి నష్టపరిహారం మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సి.క్యాంపు రైతు బజార్‌లో ఇక నుంచి ఎవరు పడితే వారు అమ్మకాలు జరిపే అవకాశముండదు. నిజమైన రైతులు, పొదుపు లక్ష్మి మహిళలు, దివ్యాంగులు మాత్రమే వ్యాపారాలు కొనసాగిస్తారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, సిఫారసులు ఇక చెల్లవు. దీంతో రైతు బజారు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకుంటున్నారు. ఏది ఏమైనా సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన అనంతరం సి.క్యాంపు రైతుబజారుకు మహర్దశ పట్టిందని చెప్పవచ్చు. ఓ వైపు విస్తరణ పనులు.. మరో వైపు రైతులకే ప్రాధాన్యంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రూ.6కోట్లు మంజూరు చేస్తూ విస్తరణ పనులు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో అధికారులు రైతుబజార్ పక్కనున్న శిథిలావస్థలో ఉన్న పది బిల్డింగ్‌లను కూల్చివేశారు. చకచకా పనులు చేపడుతున్నారు. రాష్ట్రంలోనే సి. క్యాంపు రైతుబజార్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతుబజారులో నూరు శాతం రైతులు, పొదుపు లక్ష్మి గ్రూపుల మహిళలు దివ్యాంగులకే కూరగాయలు, పండ్లు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు రైతుబజారు అధికారులు, సిబ్బంది తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్ల, సిఫారసులకు ఇక ఛాన్స్ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈనెల 17న 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా సి.క్యాంపు రైతుబజారులో పర్యటించారు. రూ.6కోట్లు మంజూరు చేస్తూ విస్తరణ పనులు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

పది బిల్డింగ్‌లను కూల్చివేయడంతో పాటు..

రెండు రోజుల క్రితం సి.క్యాంపు రైతుబజారు పక్కనే ఉన్న శిథిలావస్థకు చేరిన 10బిల్డింగ్‌లను కూల్చివేయడంతో పాటు ప్లాట్‌పారాలు, ప్రహరీ తదితర పనులన్నీ పూర్తిచేసేందుకు ఎస్టిమేట్లు తయారుచేసి మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదానికి పంపారు. ఈ విషయాన్ని బుధవారం మార్కెటింగ్ శాఖ డీఈ రఘునాథ రెడ్డి తెలిపారు. మరోవైపు సీఎం పర్యటన సందర్భంగా మరమ్మతుల పనులు పూర్తిచేసేందుకు అని సి. క్యాంపు రైతుబజారులో కూరగాయలు అమ్ముకుంటున్న రైతులు, పొదుపులక్ష్మి మహిళలకు రెండు రోజులు తాత్కాలిక విరామాన్ని ప్రకటించారు. రెండు రోజులు ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హరీష్ కుమార్ తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో తెస్తాం...

రైతుబజారులో చేపట్టాల్సిన పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని డీఈ రఘునాథరెడ్డి తెలిపారు. విస్తరణ తర్వాత ఇక ఎటువంటి రద్దీ ఉండదని, ఇంకా చాలామంది రైతులకు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలకు వితంతువులకు, కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించ బడుతుందన్నారు. సీ.క్యాంపు రైతుబజారు విస్తరణతో పాటు తొందరలోనే కల్లూరులోని గోవర్ధనగిరి రైతు బజారున ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన కూరగాయలు, పండ్లను దళారులతో అమ్మి నష్టపోకుండా ఆయా గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నా మని, రైతుబజార్లలోనే పంట ఉత్పత్తులు అమ్ముకుంటే మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.



మా జీవితాల్లో వెలుగు



సి. క్యాంపు రైతుబజారు మా జీవితాల్లో వెలుగు నింపింది. ఎప్పటి నుంచో ఇక్కడ పొలంలో పండించిన కూరగాయలు, మామిడి, జామ తదితర పండ్లను తీసుకువచ్చి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. రైతుబజారును విస్తరిస్తే మరింత మందికి జీవనోపాధి లభిస్తుంది.

గోపాల్, రైతు, నాయకల్లు

ఒత్తిళ్లు తగ్గిపోయాయి



సీఎం చంద్రబాబు రైతుబజారుకు వచ్చి వెళ్లిన తర్వాత నిజమైన రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు మాత్రమే కూరగాయలు, పండ్లు అమ్ముకునే అవకాశం దక్కింది. గతంలో మాదిరిగా రాజకీయ నాయకులు మాపై ఒత్తిళ్ల, సిఫారసులు చేయడం లేదు.

కళ్యాణమ్మ, ఎస్టేట్ అధికారి,
సి.క్యాంపు రైతుబజార్

ఉత్తమ రైతుబజార్‌గా తీర్చిదిద్దే అవకాశం



రాష్ట్రంలోనే ఉత్తమ రైతుబజార్‌గా సి. క్యాంపు రైతుబజారును తీర్చిదిద్దే అవకాశం ఏర్పడింది. గ్రామాలకు వెళ్లి కూరగాయలు, పండ్లు పండిస్తున్న రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కల్లూరులో గోవర్ధనగిరి రైతుబజారు కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది.

- శివకుమార్,
హార్టికల్చర్ అసిస్టెంట్



జస్టిస్ ఏ. హరిహరనాథశర్మను సన్మానిస్తున్న డాక్టర్ వంకి పెంచలయ్య, ప్రిన్సిపాల్ తదితరులు

చట్టాలపై అవగాహనతో న్యాయవాద వృత్తిలో రాణింపు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.హరిహరనాథ శర్మ

కర్నూలు లీగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తిలో రాణించాలంటే చట్టాలపై అవగాహనతోనే సాధ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ. హరిహరనాథ శర్మ తెలిపారు. కెరీర్ ప్రాస్పెక్ట్స్ ఇన్ లా అనే అంశంపై స్థానిక ప్రసూన న్యాయ కళాశాలలో గురువారం జరిగిన ఓ సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. లా విద్యార్థులు తమ లా కోర్సు సమయంలోనే వివిధ చట్టాలను కష్టపడి నేర్చుకోవాలని, ఆ పరిజ్ఞానంతోనే వారు కోర్టులలో సమర్థవంతంగా వాదించగలరని అన్నారు. సమాజంలో న్యాయవాద వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరికి న్యాయ సహాయం అవసరం అవుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులతో చర్చ నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల కరస్పాండెంట్ డా. వంకి పెంచలయ్య మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన కర్నూలును విద్యాపరంగా అభివృద్ధి పరిచేందుకు తాను 1999లో ఈ కళాశాలను ప్రారంభించానని అన్నారు. సీనియర్ న్యాయవాది పోకల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డా.ఎం. శివాజీరావు, డీన్ శివకుమార్, లా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల అవార్డులకు ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సుగల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి (ఐసీడీఎస్) పి. నిర్మల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, ధైర్యసాహసాలు, క్రీడలు, కళల, సంస్కృతి మొదలగు వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన భారతదేశానికి చెందిన బాలలు జూలై 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

మహానందిలో హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ పూజలు



మహానందిలో పూజలు నిర్వహించడానికి వస్తున్న హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ జానకిరెడ్డి

మహానంది, మే 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సిటీ అడిషనల్ ఎస్పీ జానకిరెడ్డి ప్రత్యేక పూజలుచేశారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకా ర్చనలను నిర్వహించారు. యాగశాల మంటపంలో అడిషనల్ ఎస్పీని వేదపండితులు ఆశీర్వదించారు. ప్రసాదాలు అందచేశారు.

పరిశ్రమలకు చేయూత

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భారీగా సబ్సిడీ
- పెట్టుబడి రాయితీ కల్పిస్తున్న ప్రభుత్వం

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా భారీగా సబ్సిడీలు ఇస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం పరిశ్రమలకు 15శాతం సబ్సిడీ ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం 25శాతం సబ్సిడీని పెంచి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతోంది. దీంతో పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందడుగువేస్తున్నారు. సామాన్య ప్రజలు పరిశ్రమ స్థాపించాలంటే జిల్లా కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా నేరుగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకొని ఏవైనా ఆటంకాలున్నా పరిశ్రమల అధికారులు గైడ్ చేస్తూ ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా పరిశ్రమల కార్యాలయంలో పేపర్ రహిత పరిపాలన సాగుతోంది. పారిశ్రామికవేత్తలు ఎలాంటి దరఖాస్తులు కార్యాలయానికి తీసుకురావాల్సిన అవసరంలేకుండా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు. పరిశ్రమల స్థాపనతో ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా లభించే అవకాశం ఉంది. జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మైక్రో స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ పాలసీలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. రూ.25 లక్షల నుంచి రూ.7కోట్ల వరకు సబ్సిడీ ఇచ్చేందుకు కొత్త పాలసీ తీసుకువచ్చింది. పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

బడుగు వికాసం పాలసీ

జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం బడుగు వికాసం పాలసీ కింద ట్రాన్స్‌పోర్టు విభాగంలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడుగు వికాసం పాలసీ తీసుకువచ్చింది. 45శాతం సబ్సిడీతో రూ.75లక్షల వరకు రాయితీ పొందేందుకు ఎస్సీ, ఎస్టీలకు అర్హత ఉంది. దాదాపు రూ.2కోట్ల ప్రాజెక్ట్‌లు బడుగు వర్గాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసిన తర్వాత 6నెలలకు సబ్సిడీ నేరుగా బ్యాంకు ఖాతాకు జమచేయనున్నారు.



పెట్టుబడి రాయితీ ఇలా

పరిశ్రమ	పెట్టుబడి వ్యయం	సబ్సిడీ (గరిష్ఠంగా)	రాయితీ కాలపరిమితి
మైక్రో ఇండస్ట్రీస్	రూ.5కోట్లు	రూ.25లక్షలు	రెండేళ్ల
స్మాల్ ఇండస్ట్రీస్	రూ.50కోట్లు	రూ.1.50కోట్లు	మూడేళ్ల
మీడియం ఇండస్ట్రీస్	రూ.250కోట్లు	రూ.7కోట్లు	నాలుగేళ్ల

పారిశ్రామికవేత్తలకు సదవకాశం



పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం సబ్సిడీ కూడా 10శాతం ఎక్కువగా ఇస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహిస్తోంది. 18ఏళ్లు పైబడినవారు పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశం ఉంది. ఈ సదవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలు వినియోగించుకోవాలి. పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సాధారణ వ్యక్తులకు కూడా ప్రస్తుతం 25శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తోంది. ఔత్సాహికులు నేరుగా ఏపీ ఇండస్ట్రీస్ . జీవోపీ . ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌నుంచే పొందవచ్చు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి.

జవహర్‌బాబు, జిల్లా
పరిశ్రమల అధికారి

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ



రాఘవేంద్రుని సన్నిధిలో హెచ్‌డీ రేవన్నకు ప్రసాదం అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మే 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ గురువారం మంత్రాలయానికి వచ్చారు. ఈయనకు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్లు శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రేవణ్ణను ఆశీర్వదించారు.




వర్షపు నీటితో నిండిన నాపరాయి గని

గనుల్లో నీళ్లు ..

- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- ఆందోళనలో గనుల యజమానులు

కొలిమిగుండ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కురిసిన వర్షాలకు నాపరాతి గనుల్లో నీళ్ల చేరాయి. నాపరాయి గనుల్లో చేరుతున్న వర్షపు నీరు గని కార్మికులకు ఆవేదన కలిగిస్తోంది. ఉపాధి కోల్పోయి బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంతో పాటు, అవుకు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లో నాపరాయి గనుల ద్వారా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని బెలుం, బెలుంశింగవరం, మీర్జాపురం గ్రామాల్లోని నాపరాయి గనుల్లో వర్షం నీరు పెద్దఎత్తున చేరుతోంది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రారంభించిన గనులు చేసుకోలేని పరిస్థితి నెలకొందని గనుల యజమానులు వాపోతున్నారు. గనులు నీటితో నిండటంతో ఇటు యజమానులకు, అటు కార్మికులకు పనిలేక జీవనం భారంగా మారే పరిస్థితి నెలకొంది. ఈఏడాది ఎండాకాలంలోనే గనుల్లో నీరు చేరుతున్నాయని, గనులు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని బాబు అనే గని యజమాని తెలిపారు.



నాపరాయి వెలికి తీస్తుండగా వర్షంతో గనుల్లో చేరిన నీరు

క్రీడా జోష్

- జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- క్రీడాకారుల వివరాలు క్రీడా యాప్‌లో నమోదు
- శాప్ నుంచి సర్టిఫికెట్లు అందజేత



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు




నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియం

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో భవిష్యత్తులో క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్)నుంచి సర్టిఫికెట్లు కూడా అందిస్తున్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరం నిర్వహించడంతో క్రీడాకారులు తయారు అవుతున్నారు. జిల్లాలో 50వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు వీటికి క్రీడా సామగ్రితో పాటు శిక్షకుడికి గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ఉదయం 6 గంటల నుంచి...

జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈశిబిరాలకు ప్రభుత్వం రూ.3.5లక్షలు కేటాయించింది. ఇందులో రూ.5వేలు క్రీడాసామగ్రికి, రూ.1500 శిక్షకుడికి, మరో రూ.500 నిర్వహణ నిమిత్తం ఉపయోగించాల్సి ఉంది. ప్రతి శిబిరంలో 25మంది బాలురు, 25మంది బాలికలకు శిక్షణ ఇస్తారు. ఉదయం 6నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 7గంటల వరకు శిక్షకులు శిక్షణ ఇస్తారు. 8నుంచి 14ఏళ్లలోపు బాల, బాలికలు ఈఅవకాశం కల్పించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారుల వివరాలు క్రీడాయాప్‌లో శిక్షకులు నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్ చేసుకున్నవారికి నేరుగా ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ కూడా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇవ్వనుంది. నంద్యాలలో ఎస్పీజీ మైదానంలో ఫుట్‌బాల్, హాకీ, ఇండోర్ స్టేడియంలో తైక్వాండో, వాలీబాల్, ఫెన్సింగ్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

శిబిరాలను వినియోగించుకోవాలి



వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి. రూ.2.5లక్షలతో క్రీడా సామగ్రిని అందజేశాం. వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, తైక్వాండో, బాల్‌బాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్ బాల్, యోగాకు సంబంధించి సామగ్రిని అందజేశాం. పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఈశిబిరాలు ఎంపిక చేశాం. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించాల్సిఉంది.

- ఎంఎన్‌వీ రాజు,
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, నంద్యాల



ఎస్పీజీ మైదానంలో హాకీ నేర్చుకుంటున్న క్రీడాకారులు



విద్యుత్ స్తంభం ఎక్కడ?

గోనెగండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): ఇదేంటి చెట్టులోంచి విద్యుత్ వైర్లు కనిపిస్తున్నాయని అనుకుంటున్నారా? బాగా గమనిస్తే తెలుస్తుంది. అక్కడ ఓ విద్యుత్ స్తంభం ఉందని. మండలంలోని ఎన్నెకండ్ల గ్రామ శివారులో గోనెగండ్లకు వెళ్లే ప్రధాన దారిలో ఉన్న ఈ విద్యుత్ స్తంభానికి అడ్డుగా చెట్లు ఏపుగా పెరిగాయి. దానికి తోడు తీగలు సైతం విద్యుత్ స్తంభాన్ని పై వరకూ అల్లుకుపోయాయి. దీంతో విద్యుత్ స్తంభం తీగలు, చెట్ల చాటుకు వెళ్లిపోయింది. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి మరి.

- గోనెగండ్ల (ఆంధ్రజ్యోతి)

ఎంవీఐపై కర్ణాటక వాసి దాడి

• తమ వాహనాన్ని ఆపారని ఆగ్రహం



కర్ణాటక వాసులను వారిస్తున్న తాలుకా పోలీసులు

ఆదోని రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మా వాహనాన్నే ఆపుతావా అని ఆదోని ఎంఈఐపై కర్ణాటక వాసులు దాడికి పాల్పడ్డారు. వివరాల మేరకు.. ఆస్పరి బైపాస్‌లోని విరుపాపురం సమీపంలో ఆదోని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కదిరి మహమ్మద్ అవైద్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇంతలో కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నాలూరు తాలుక హోసావెళ్లి గ్రామానికి చెందిన చంద్రప్ప, కుటుంబ సభ్యులు 14 మంది మినీ బస్సులో మంత్రాలయంలో దర్శనం అనంతరం కర్ణాటకకు తిరుగు ప్రయాణమయ్యారు. తన విధుల్లో భాగంగా ఎంవీఐ వాహనాన్ని తనిఖీ చేస్తుండగా చంద్రప్ప కుటుంబ సభ్యులు ఎంవీఐతో వాగ్వాదానికి దిగారు. నీవు అసలు ఎంవీఐవేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రయ్య సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, ఎంఈఐపై సెల్‌ఫోన్ లాక్కొని పగులకొట్టి తన వాహనం స్టార్ట్ చేయగా, కర్ణాటక వాసి చంద్రప్ప ఎంవీఐ వాహనం బంపర్‌పై కూర్చున్నా ఎంఈఐపై కిలోమీటర్ వరకు అలాగే వాహనాన్ని నడిపారు. దీంతో మినీబస్సు డ్రైవర్ ప్రకాష్ తన వాహనాన్ని వేగంగా తీసుకెళ్ళి ఎంవీఐ వాహనానికి అడ్డంగా పెట్టాడు. అప్పటికే ట్రాఫిక్ జామ్ కావడంతో విషయం తెలుసుకొన్న తాలుక ఎస్.ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తన విధులకు ఆటంకం కలిగించారని ఎంవీఐ కర్ణాటక వాసి చంద్రయ్యపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

పేకాటలో పట్టుబడ్డ వైసీపీ నాయకులు

బనగానపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కౌసర్‌బాగ్ వద్ద పేకాట ఆడుతూ నలుగురు వైసీపీ నాయకులు పట్టుబడ్డారు. ఇది చర్చనీయాంశంగా మారింది. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై గురువారం దాడి నిర్వహించారు. వైసీపీ నాయకులు సంకేపల్లి ప్రతాపరెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, మంగవరం శంకర్‌రెడ్డి, బండి పుల్లారెడ్డి పేకాట ఆడుతూ పట్టుబడినట్లు వారు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10,610 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేరాల అదుపునకు సహకరించాలి

• సీఐ మధుసూదన్‌గౌడు • షరీన్‌నగర్‌లో తనిఖీలు
• పత్రాలు సరిగా లేని 12 బైకుల స్వాధీనం



షరీన్‌నగర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలని నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు పేర్కొన్నారు. గురువారం షరీన్‌నగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ మధుసూదన్‌గౌడు సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డ్స్‌తో కలిసి పాత నేరస్థులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో తనిఖీలు చేశారు. వాహనపత్రాలు సరిగ్గా లేని 12 బైకులను స్వాధీనం చేసుకు న్నారు. అనంతరం సీఐ కౌన్సెలింగ్ చేశారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యంతో మహిళ మృతి

• ప్రాణం హరించిన పంటినొప్పి ఇంజెక్షన్

సంజామల, మే 22(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యం ఒక నిండు ప్రాణాన్ని బలికొంది. పంటినొప్పికి వేసిన ఇంజెక్షన్ వికటించిన సంఘటన నంద్యాల జిల్లా సంజామల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చిన్నకొత్తపేట గ్రామానికి చెందిన బుర్రా సుబ్బలక్ష్మమ్మ (52) బుధవారం రాత్రి పంటినొప్పితో సంజామల ఆర్.ఎం.పీ వైద్యుడు దస్తగిరి వద్దకు వెళ్లింది. ఆయన నరానికి ఇంజెక్షన్ వేయడంతో అక్కడికక్కడే మహిళ స్పృహతప్పి పడిపోయింది. తన తల్లి నోటి నుంచి నురుగు రావడంతో వెంట వెళ్లిన కొడుకు బాలకృష్ణ ఆందోళన చెందాడు. వైద్యుడు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే సుబ్బలక్ష్మమ్మ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ రమణయ్య నంద్యాల ప్రొఫెసర్ ఆధ్వర్యంలో శవ పరీక్ష చేయించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు, భర్త ఉన్నారు. ఆరోగ్యంగా ఉంటూ కూలి పనికి వెళ్లి వచ్చే తల్లి ఇలా మరణించిందని కొడుకులు కన్నీటి పర్యంతమయ్యారు.



సుబ్బలక్ష్మమ్మ (ఫైల్)

'మావోయిస్టు నేతల హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర నాయకుడు పాణి

కర్నూలు కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు, నాగేశ్వరరావు, ఇతర ఆదివాసీ మావోయిస్ట్ హత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు హత్యను నిరసిస్తూ గురువారం నగరంలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఇందులో వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్ట్ అగ్ర నాయకులతోపాటు అమాయక ఆదివాసీ యువకులను చంపివేస్తున్నారన్నారు. విరసం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాణి మాట్లాడుతూ కేశవరావు మావోయిస్టు ఉద్యమాన్ని సైనిక, రాజకీయ రంగాల్లో అత్యున్నత స్థాయికి తీసికెళ్లాడన్నారు. ఈ దేశ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టడానికే మావోయిస్టు నాయకులను, ఆదివాసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేస్తున్నాయని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ మాట్లాడుతూ కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను మైదాన ప్రాంతంలోని ప్రజాస్వామికవాదులు ప్రశ్నించాలని అన్నారు. రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న మాట్లాడుతూ దేశ ప్రజలపై సొంత సైన్యం యుద్ధం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సీపీఐ బాధ్యుడు మహేష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్ రెడ్డి, డీటీఎఫ్ నాయకుడు కేఆర్‌వై, ఎస్‌యూసీఐ నాయకుడు నాగన్న, ఉపాధ్యాయ నాయకుడు రాజా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సారాను నిర్మూలించండి

• నవోదయం-2 పై డైరెక్టర్ ఆరా.. • డీసీ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సారాను పూర్తిగా నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. గురువారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, డీపీఈవో, ఏఈఎస్‌లతో ఆయన నవోదయం-2లో సారా నిర్మూలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాటు సారాయి, సుంకం చెల్లించని అక్రమ మద్యం, గంజాయిని అరికట్టడంలో తీసుకోవాల్సిన చర్యలు, వీటిపై నమోదు చేసిన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కర్నూలును సారా రహిత జిల్లాగా ప్రకటించడానికి అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ నుంచి బార్డర్ చెక్ పోస్టుల పనితీరును పరిశీలించారు. చెక్ పోస్టుల్లో నిఘా పెంచి అక్రమ మద్యం జిల్లాలోకి రాకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. రీజినల్ ఎక్సైజ్ ల్యాబొరేటరీ, అందులోని పరికరాలను పరిశీలించి ల్యాబ్ పని తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ సుధీర్ బాబు, ఏఈఎస్ రాజేఖర్‌గౌడ్, రామక్రిష్ణారెడ్డి, సీఐలు రాజేంద్రప్రసాద్, జయరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ను కలిసిన జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మను జిల్లా ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని సమస్యలు పరిష్కరించాలని, కానిస్టేబుల్, సిబ్బంది కొరత వల్ల ఉద్యోగులకు పని భారం ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఐ సందీప్, సోమశేఖర్, నవీన్, రేహానా బేగం పాల్గొన్నారు.

కురువ విద్యార్థులకు బహుమతులు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఎంపీపీ హాలులో గురువారం ప్రతిభావంతులైన 135 మంది కురువ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన 135 మంది కురువ విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, అమీలియో హాస్పిటల్ అధినేత డా. లక్ష్మీప్రసాద్, భానుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల లొల్లి.. ఆగిన పెళ్లి

• నిశ్చితార్థం రోజే పెళ్లి కొడుకు ఆత్మహత్యాయత్నం • చికిత్స పొందుతూ మృతి • ఆదోని మండలంలో విషాదం

ఆదోని రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయల విషయంలో జరిగిన లొల్లితో ఓ పెళ్లి ఆగిపోయింది. నిశ్చితార్థం రోజే పెళ్లికొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు ఇస్వీ ఎస్ఐ నాయక్ తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం హనవాళ్ల గ్రామానికి చెందిన గోరంట్ల, ఈరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. గోరంట్ల హాళగుంద ఎల్లెల్సీ కాల్వ లస్కర్‌గా పనిచేస్తున్నాడు. వీరి రెండో కుమారుడు హరిజన రాజు(20) అదే మండలానికి చెందిన పెద్దగొనేహాళ హోసూరుకు చెందిన మహిమజ్యోతి అనే యువతిని ప్రేమించాడు. ప్రేమికులిద్దరు కుటుంబ సభ్యులకు తమప్రేమ వ్యవహారం చెప్పి పెళ్లికి ఒప్పించారు. అయితే మహిమజ్యోతి తల్లిదండ్రులు క్రిస్టియన్ పద్ధతిలో పెళ్లిచేయాలని రాజు తల్లిదండ్రులకు మెలికపెట్టారు. హిందూ సంప్రదాయ బద్ధంగా పెళ్లి చేసుకుంటానని రాజు మొండికేశాడు. అయినప్పటికీ ఇరువురు తల్లిదండ్రులు క్రిస్టియన్ పద్ధతిలో పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 16వ తేదీన ముహూర్తం ఖరారుచేశారు. 15వ తేదీన రాజు ఇంటివద్ద పెళ్లి పందిరి కూడా వేశారు. అదేరోజు మధ్యాహ్నం రాజు తనబావతో కలిసి బైక్‌పై ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో పెద్దహరివాణం సమీపంలో అత్య వసరం ఉందని బైక్ ఆపాలని కోరాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో ఉన్నాడు. అతడిని హుటాహుటిన ఆదోని ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా కోలుకోలేక గురువారం రాజు మృతిచెందాడు. వరుడు మృతితో ఇరు కుటంబాల్లో విషాదం నెలకొంది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వరుడు రాజు (ఫైల్)

సీఐ తీరుపై దుమారం

• ఉన్నతాధికారులకు ఓ మహిళ ఫిర్యాదు
• ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ? • ఆలస్యంగా వెలుగులోకి..

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పనిచేస్తున్న ఓ సీఐ తీరుపై దుమా రం రేగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ఓ మహిళ రెండు వారాల కిందట సదరు వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా ఆశాఖ వర్గాల్లో పలువిదాలుగా చర్చ సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. సదరు సీఐ కొంత కాలంగా ఓ మహిళా ఉద్యోగితో (ఇతర శాఖలో పనిచేస్తున్న) బాధ్యతారహితంగా వ్యవహరించారని సమాచారం. ఈ వ్యవహారం చాలాకాలం నుంచి జరుగుతోందని వినికిడి. అయితే ఇద్దరికి కూడా బాగానే సన్నిహిత్యం ఉండేదని సమాచారం. ఇంతలోనే ఏమైందో.. ఏమో కానీ..? ఇరువురి మధ్య ఏదైనా సమస్య ఏర్పాడిందా..? గతంలో మాదిరిగా ఇరువురు ఉండ లేదనే ఏమైనా తలెత్తిందా..? అనే అనుమానాలకు తావిస్తోంది. ఆ మహిళ ఈసీఐని ఎంత బతిమిలాడిన సద్దుమణిగేలా వ్యవహారించడం లేదని సమాచారం. సీఐ తీరులో మార్పు లేకపోవంతో ఆమె నేరుగా ఇటీవల ఎస్పీతో పాటు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సమస్య పరిష్కారం అయిందో.. లేదో తెలియదు. కానీ ఆ మహిళా ఉద్యోగి సీఐ తీరుపై ఓ ప్రజాప్రతినిధి వద్ద గోడు చెప్పి పంచాయితీ పెట్టినట్లు సమాచారం. ఏది ఏమైనా పోలీసుశాఖలో ఇలాంటి వ్యవహారం చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు

• క్లీనర్ మృతి

డోన్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారిపై కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు ప్రమా దంలో లారీ క్లీనర్ మృతి చెందారు. వివరాలివీ.. డోన్ పట్టణం హైవే మొబైల్-3 వద్ద కొత్తపల్లి ఫ్లైఓవర్ మీద ఓ లారీ పంక్చర్ కావడంతో నిలబడిన లారీ సైడులో లారీ క్లీనర్ చంటి రాళ్లు పెడుతుండగా.. కదిరి నుంచి హైదరా బాదు వెళ్తున్న బస్సు వెనుక వైపు నుంచి లారీని ఢీకొట్టింది. లారీ వెను కాల ఉన్న క్లీనర్ బస్సు ఢీకొనడంతో లారీకి, బస్సుకు మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు.. లారీ డ్రైవర్ అమీర్, బస్సు డ్రైవర్ భాస్కర్‌కు గాయాలయ్యాయి. అలాగే బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయి. గాయాలైనవారిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

పెళ్లిపీటలు ఎక్కకుండానే యువతి మృతి

ఆస్పరి, మే22(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టాల్సిన యువతి పెళ్లి పీటలు ఎక్కక ముందే తనువు చాలించింది. వివరాల మేరకు.. కాశన్న, బీబీ దంపతులకు నలుగురు కుమార్తెలు. మూడవ సంతానమైన సబేరా(20)కు వివాహం నిశ్చయమైంది. గురువారం కుళాయి విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేయబోయి విద్యుదాఘాతానికి గురైంది. తల్లిదండ్రులు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కుట్టు శిక్షణతో వెలుగు

• బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
• శిక్షణ అనంతరం కుట్టుమిషన్ల పంపిణీ
• స్వయం ఉపాధి పొందుతామంటున్న మహిళలు

హాలహర్వి, మే 22 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ బీసీ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. స్త్రీశక్తిగా ఎదగాలని, స్వయం ఉపాధితోనే ఇది సాధమన్న ప్రభుత్వ ఆశయం పేదలకు ఆర్థిక స్వావలబంన ఇస్తోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

బీసీ కార్పొరేషన్ తరపున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే మహిళలకు శిక్షణ ఇస్తారు. మహిళలు స్వయం ఉపాధి పొందా లన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది.

ఉచితంగా కుట్టు మిషన్లు

కుట్టు శిక్షణ 90 రోజులపాటు ఉంటుంది. శిక్షణకు 75 రోజుల పాటు హాజరైన వారికి ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తుంది. దీంతో మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం తమకు భరోసా ఇచ్చిందని మహిళలు అంటున్నారు.



హాలహర్విలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

కుట్టుతో పాటు ఎంబ్రాయిడరింగ్‌లో శిక్షణ

హాలహర్వి మండలంలో దాదాపు 70 మంది వరకు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ప్రారంభించి నెల పూర్తవుతోంది. టైలరింగ్, అల్లికలు, ఎంబ్రాయిడరింగ్, రకరకాల ఫ్యాషన్లలో కుట్టు నేర్పిస్తున్నారు.



కుట్టు శిక్షణతో భరోసా

మాది నిరుపేద కుటుంబం. నేను పొలం పని చేయలేను. నా భర్త కూలితో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కుట్టుశిక్షణకు రోజూ వస్తున్నారు. పూర్తయితే నాకు ఎంతో భరోసాగా ఉంటంది. **- ముత్తమ్మ, హాలహర్వి**



ఎంతోమంది మహిళలకు ఆసరా

బీసీ కార్పొరేషన్ ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణ వల్ల ఎంతోమంది మహిళలకు ఆసరా ఉంటుంది. మాలాంటి మహిళలకు ఇలాంటి శిక్షణలు మేలు చేస్తాయి. ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వడం వల్ల స్వశక్తితో ఉపాధి పొందవచ్చు. **- అనంతలక్ష్మి, అర్ధగేరి గ్రామం**



స్వయం ఉపాధితో మేలు

సంక్షేమ పథకాల వల్ల మాకు ఒరిగిందేమీ లేదు. చేతివృత్తులు, అల్లికలు, కుట్టు శిక్షణతో ఊపిరినిస్తుంది. శిక్షణతో మా బతుకుల్లో వెలుగు చూడవచ్చు. ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం. **- రాజ్వేరి, పొదుపు మహిళ, హాలహర్వి**



మహిళలు ఉపయోగించుకోవాలి

ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు కూడా ఇస్తుంది. మహిళలు ఉపయోగించుకునిఉపాధి పొందాలి. కుటుంబాలను పోషించుకోవాలి. **- వరలక్ష్మి, ఎంపీడీవో, హాలహర్వి**

బంగారు వ్యాపారిపై కేసు నమోదు

• ఘటన జరిగిన రెండు వారాల తర్వాత కేసు

నంద్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ బంగారు వ్యాపారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఘటన జరిగిన 14 రోజుల తర్వాత పోలీసులు ఇరువర్గాలపై కాకుండా సదరు వ్యాపారిపై మాత్రమే కేసు నమోదు చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. నంద్యాల పట్టణంలోని పాతూరులో పేరు మోసిన ఓ బంగారు వ్యాపారి దుకాణం పెట్టుకుని గోల్డ్ వ్యాపారం చేస్తున్నారు. అయితే ఈ నెల ఏడో తేదీన పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు దుకాణానికి వెళ్లారు. అయితే అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ.. వ్యాపారితో దుకాణానికి వచ్చిన వారు దాడులు చేస్తున్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. ఈ క్రమంలో వ్యాపారితో పాటు దుకాణానికి వచ్చిన వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి ఇరువర్గాలను పంపించారు. ఈయితే ఇదే విషయమై మరో మారు దాడికి పాల్పడిన వారందరు కలిసి సదరు వ్యాపారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులను నిలదీసినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సదరు వ్యాపారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చూస్తే వ్యాపారిపై దాడి చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. పోలీసులు మాత్రం దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వ్యాపారి ఫిర్యాదు చేస్తే దాడి చేసిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయ స్సు 50 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శరీరంపై తెలుపు రంగు షర్టు, కషాయం రంగు టవల్ ఉన్నాయి. కుడి చేతిపైన 96975368 అనే అంకెలు ఉన్న టాటుమార్క్ ఉంది.

ఎడమ చేతిపైన ఓం సింబల్‌తో ఉన్న టాటు మార్కు ఉంది. ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి నెంబరు 9441802327కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.



సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తాం

● సీహెచ్‌వోలతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


సీహెచ్‌వోలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మీ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు. నంద్యాలలో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద సీహెచ్ వోలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో జరిగిన టీడీపీ మినీ మహానాడు కార్యక్రమానికి వెళుతూ సీహెచ్‌ఓల శిబిరం వద్ద వాహనాన్నిఆపి వారిని పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌వోలు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి 25వ రోజుకు చేరింది. ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, కార్యదర్శి గురుప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, సీహెచ్‌వోలు చక్రధర్, హారిక, అఖిల్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్ యోజన'పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు

నంద్యాల కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఐటీఐ విద్యార్థులకు టాటా పవర్ సోలార్ రూఫ్ కీర్తి సోలార్ పవర్ ఏజన్సీ మేనేజింగ్ పార్టనర్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోలార్ ఎనర్జీ ప్రాముఖ్యం, గృహాలకు సౌరవిద్యుత్ వ్యవస్థలను ఎలా అమలు చేయాలి, సూర్యఘర్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ సలోమి మాట్లాడుతూ విద్యార్థులకు సోలార్ టెక్నాలజీలో ఉన్న అవకాశాలు, స్వయంగా వ్యవస్థలను ఎలా అమలుచేయాలో ప్రాక్టికల్ శిక్షణ, అవగాహన కల్పించారు. సోలార్ పవర్ ఏజెన్సీల నంద్యాల బ్రాంచ్ మేనేజర్ జాకీర్ హుస్సేన్, టెక్నీషియన్ రాజా, జేవీఆర్ఆర్ ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పాములపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని మోడల్ స్కూల్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విద్యార్థులను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈనెల 20న అభినందించి బహుమతులను అందించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. ప్రిన్సిపాల్ గురువారం మాట్లాడుతూ మల్లన్న 593, జాల యశ్వని 591 మార్కులు సాధించడంతో షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేశారని తెలిపారు.

ఆగిన వేలం పాటలు

బండిఆత్మకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజనం గ్రామంలో వెలసిన ముక్తేశ్వర స్వామి ఆలయ భూముల వేలం పాటలు అసంపూర్తిగా నిలిచినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. గురువారం స్వామి వారికి చెందిన 41 ఎకరాల భూమికి గాను 13.73 సెంట్ల భూమికి సంబంధించిన పొలాలకు మాత్రమే పాటదారులు రూ.2,30,000 వేలం పాట పాడారు. గత ఏడాది కన్నా ఈ భూములకు సైతం రూ.23వేల రాబడి తగ్గిందని తెలిపారు. మిగిలిన సుమారు 28 ఎకరాల భూములకు సరైన వేలం లభించక పోవడంతో సదరు వేలం పాటలను పర్యవేక్షకులు కార్తీక్ నిలిపివేసినట్లు ఈవో తెలిపారు.

వైభవంగా హనుమజ్జయంతి

హనుమజ్జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. అంజనేయ స్వామి , రామాలయాల్లో కొలుదీరిన హనుమంతుడికి ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.


జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో..


మిడుతూరు: తలముడిపి గ్రామంలో..


పాములపాడు: ఎర్రగూడూరులో..


బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవళాపురంలో పూజలు


పగిడ్యాల: ముచ్చుమర్రిలో..


నంద్యాల కల్చరల్: నంద్యాలలో ఆకట్టుకుంటున్న వేషధారణ


ఆత్మకూరు రూరల్: శ్రీపతిరావు పేటలో..


పాణ్యంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


వెలుగోడులో..


మహానందిలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి


ఆత్మకూరులో శోభయాత్ర


నంద్యాల కల్చరల్: నంద్యాల పట్టణంలో..

రేషన్ డీలర్ల హర్షం


పాణ్యంలో ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు


జూపాడుబంగ్లాలో..

పాణ్యం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాణ్యం తహసీల్దారు కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలకు క్షీభిషేకం నిర్వహించారు. డీలర్ల సంఘం నాయకులు రంగస్వామి, జయరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల వినతి మేరకు కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్లకు తిరిగి యథావిధిగా బాధ్యతలు అప్పజెప్పడంపై హర్షం వ్యక్తం చేస్తున్నార న్నారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఫెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

పాములపాడు: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రేషన్ వాహనాలు రద్దుచేసి గతంలో మాదిరిగా చౌక ధరల దుకాణాల ద్వార సరుకుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో మండల రేషన్‌డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల తహసీల్దార్ సుభద్రమ్మకు, సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి శివానందరెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రజలకు మిఠాయిలను పంపిణీ చేశారు.

వెలుగోడు: వెలుగోడు తహసీల్దార్ కార్యాలయం వద్ద కూటమి ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు రేషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. పాత పద్ధతిలో రేషన్ పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు.


పాములపాడులో..


వెలుగోడులో..

భారతీయ సంస్కృతిని కాపాడుకుందాం: ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు. నంద్యాలలో విశ్వహిందూ పరిషత్-బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర హనుమాన్ శోభాయాత్రకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురు వారం నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో సభ ఏర్పాటు చేశారు. ఈ సభా ప్రాంగణంలో వీరహనుమాన్ శోభాయాత్ర గురించి, పహల్గామ్ దాడి గురించి, వక్తలు ప్రసంగించారు. హిందువులంతా మేల్కొనాలని, ఏకం కావాలని వక్తలు ప్రసంగించారు. అనంతరం ఈ శోభాయాత్ర నిర్వహించారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్ రెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, జిల్లా కార్యదర్శి కిషోర్, సహకార్యదర్శి నాగరాజు, నగర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, డాక్టర్ రామకృష్ణారెడ్డి, చిలుకూరి శ్రీనివాస్, టీడీపీ నాయకలు తులసిరెడ్డి, రామచంద్రారావు, ఖండేశ్యామ్‌సుందర్‌లాల్, బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, అడ్డగాళ్ల మల్లికార్జున, బీజేపీ నాయకులు మేడా మురళీధర్, చింతలపల్లె వాసు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎన్‌హెచ్ అధికారులు

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సప్తనదుల సంగమేశ్వరస్వామిని కల్వకుర్తి- నంద్యాల హైవే 167కే ఇంజనీరింగ్ అధికారులు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ప్రత్యేక పూజలు చేయించి ఆలయ విశిష్టతను వివరించారు. సంగమేశ్వరుడ్ని దర్శించుకున్న వారిలో 167-కే డిప్యూటీ సీఈ జి.రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాజేంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, టీం లీడర్ ప్రదీప్ శంకర్, కాంట్రాక్టరు శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఈ మురళి ఉన్నారు. డిప్యూటీ సీఈ మాట్లాడుతూ 167-కే నేషనల్ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా సంగమేశ్వర ప్రాంతంలోని రెండు కొండల మధ్య ఐకానిక్ బ్రిడ్జి ఏ విధంగా నిర్మించాలి, అలాగే కొల్లాపూర్ నుంచి సోమశిల వరకు అప్రోచ్ పనులు ఎలా చేపట్టాలి.. నిర్మాణ పనులు ఏ విధంగా చేపడితే బావుంటుందనే వాటిపై పరిశీలించేందుకు వచ్చినట్లు వారు చెప్పారు.

వైసీపీని ప్రజలు నమ్మరు: మంత్రి బీసీ


మాట్లాడుతున్న మంత్రి బీసీ


మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నందికొట్కూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఒట్టి డైలాగులు చెప్పే నాయకులను ప్రజలు ఎప్పుడు నమ్మరని, తమకు సేవ చేసే నాయకులనే నమ్ముతారని, వైసీపీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీతో పాటు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మార్కెట్ యార్డు నూతన ఛైర్మన్‌గా వీరం ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సుధాకర్ యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సభ్యులుగా బి.మహేశ్వరి, తెలుగు పెద్ద దస్తగిరి, జి.విజయలక్ష్మి, ఐ.జీవన సుఖన్య, ఎం.రాములమ్మ, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పి.మళ్లీశ్వరి, ఆర్.ఛాయలీల, ఎస్.సంపత్‌కుమార్, జెడ్. నిర్మల, బి.రవిరాజ్, ఎస్.రేష్మా పర్వీన్, ఎస్.గాజుల మన్‌సూర్‌భాషలు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ గత వైసీపీ నాయకులు డైలాగులు చెబుతూ కాలం వెళ్లదీశారని, అది గమనించిన ప్రజలు కూటమికి పట్టం కట్టారన్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి పదవులు కట్టబెట్టడం ఒక్క టీడీపీకే దక్కుతుందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధానమైన మూడు సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ఎన్నికల ముందు ఇచ్చిన మిడ్తూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటును 2029 నాటికి పూర్తి చేసి మిడ్తూరు, జూపాడుబంగ్లా మండలాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయమైందని, వెంటనే మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అలాగే మండ్లెం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిరైతులను ఆదుకోవాలని కోరారు. మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ 80 శాతం వ్యవసాయంపై ఆధారపడిన నందికొట్కూరు నియోజకవర్గంలో సాగునీరు లేక రైతాంగం ఇబ్బందులకు గురవుతున్నారు. రైతాంగానికి సాగునీరు అందించే దిశగా తన అడుగులు ఎప్పుడూ ఉంటాయని మాండ్ర తెలిపారు. ప్రసాద్‌రెడ్డి, పార్టీని నమ్ముకుని ఉన్నందుకే ఆయనకు చైర్మన్ పదవి దక్కిందన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, 29వ వార్డు కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్, జనసేన నాయకులు రవి, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పాములపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో గోరపూటి సత్యం (48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గురువారం పాములపాడు ఎస్‌ఐ సురేశ్‌బాబు తెలిపిన వివరాలివీ.. జూటూరు గ్రామానికి చెందిన గోరంట్ల సత్యం మృతదేహం గ్రామ శివార్లలోని కేసీ కెనాల్ తూము వద్ద పడి ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సత్యం భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీజీహెచ్‌లో సీటీ స్కాన్ సేవలు పునఃప్రారంభం

నంద్యాల హాస్పిటల్, మే 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని జీజీహెచ్‌లో సీటీ స్కాన్ సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 19వ తేదీనుంచి సీటీస్కాన్ పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి ఎన్‌ఆర్ఐ అకాడమీ సంస్థతో మాట్లాడి మే 7నుంచి ప్రత్యామ్నా యంగా అత్యవసరమైన రోగులకు పట్టణంలోని ఫోకస్ స్కానింగ్ సెంటర్‌లో తీసే ఏర్పాట్లు చేశారు. కాగా జీజీహెచ్‌లోని సీటీస్కాన్ రిపేరి కావడంతో తిరిగి సేవలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మహానాడులో జిల్లా సమస్యలపై చర్చించాలి'

నంద్యాల రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27,28,29 తేదీల్లో కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమంలో నంద్యాల జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వర అలుగు నిర్మాణం, ప్రభుత్వ హస్పిటల్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంపై హర్షం

పాణ్యం, మే 22(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా గుంతలతో నిండి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న గోరుకల్లు ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు రహదారి నూతన నిర్మాణంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం టీడీపీ బీసీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ నంద్యాల రవి ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా పాణ్యం నుంచి దుర్వేశి బాట రస్తా వరకు ఉన్న బీటీ రహదారి గుంతలమయమై నడవలేని స్థితిలో ఉండేదని, చాలా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. అయితే ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు పంచాయతీరాజ్ నాబార్డు నిధులు రూ. 6. 50 కోట్లతో 13 కిలో మీటర్లు రెండు నెలల్లో రహదారి పూర్తి చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకులకు సన్మానం

వెలుగోడు, మే 22 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండల, పట్టణ నూతన కమీటిని టీడీపీ నాయకులు ప్రకటించారు. ఈ కమిటీలో టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎంఎ కలాంను పట్టణ అధ్యక్షుడిగా మోమిన్ రసూల్, పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా ఖలీల్ ఎంపికయ్యారు. వీరిని గురువారం రోఖియాబి దర్గా కమిటీ నిర్వాహకులు ఖాదర్‌వలి, మహబూబుబాషా, షాలీ పహిల్వాన్‌లు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్‌కు..

పగిడ్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్‌యార్డు నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డిని టీడీపీ పగిడ్యాల మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, నెహ్రూనగర్ టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జి నరసింహరెడ్డి, నరసింహ, సూరి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు చైర్మన్, డైరెక్టరుగా ఎన్నికైనవారికి వారు అభినందనలు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మురుగు నిల్వ లేకుండా చర్యలు: మంత్రి బీసీ



మురుగు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పర్యటిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 22 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని వీధుల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు చేపడతామని రోడ్డు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో మురికి నీరు నిలిచిన వీధుల్లో పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణానికి చెందిన దివ్యాంగుడు నవీన్ తనకు వాట్సాప్‌లో పంపిన వీడియోను చూశానన్నారు. అందులో భాగంగా వీధుల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించామన్నారు. వీధుల్లో మురుగు నీరు నిలుస్తుండటంతో దుర్వాసన వస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వీధుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నట్లు మహిళలు తన దృష్టికి తెచ్చారన్నారు. వారం రోజుల్లో వీధుల్లో పందులు కనిపించకుండ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాప్రతినిధుల చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

ఆళ్లగడ్డ మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎండీయూ వాహనాలు తొలగించి రేషన్ డీలర్ వ్యవస్థను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొన్న నిర్ణయం పట్ల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు రెషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మజీద్, బైసాని ప్రసాద్, వివిధ ప్రాంతాల డీలర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో నంద్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ నాయక్ గురువారం సాయంత్రం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా తాడిపత్రి, జమ్మలమడుగు, నంద్యాల రహదారులతో పాటు పలు సర్కిల్స్‌లో వచ్చిపోయే వాహనాలను తనిఖీలు చేశారు. పత్రాలు సరిగా లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

మన సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శం



కోలాట గురువు మధును సన్మానిస్తున్న బ్రహ్మానందచారి

బనగానపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): భారతదేశ సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనందచారి గురువారం అన్నారు. బేతంచర్ల పట్టణానికి చెందిన కోలాట గురువు మధును సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మనందచారి మాట్లాడుతూ ప్రభుత్వం సాంప్రదాయ కళలను ప్రోత్సహించాలన్నారు. కోలాటాలు, హరిభజన, చెక్కభజన, పండరి భజన నాటకాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దయ్య, సుధాకర్‌గౌడు, రమేష్, మధు శిష్య బృందం పాల్గొన్నారు.

నాయకుడి కుటుంబానికి పరామర్శ



టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మన్నె గౌతమ్ రెడ్డి

డోన్ రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం కొండపేటలో ఐటీడీపీ నాయకుడు బీఎడ్ బాషా తండ్రి ఆరోగ్య పరిస్థితిని డోన్ టీడీపీ యువ నాయకుడు మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

చాగలమర్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి ఏపీవో ఖాసీం తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2,600 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. పంటకుంటలు, ఇంకుడు గుంతలు, పంట కాలువల పూడికతీత పనులు చేయాలని సూచించారు. పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకునేలా చూడాలని అన్నారు. 300 ఎకరాల పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని, లక్ష్యాన్ని అధిగమించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



అర్చన

ప్యాపిలి, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చన ఎంపికైంది. ఇటీవల ఆత్మకూరులో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలిక ప్రతిభ కనపరిచింది. ఈ నెల 25న వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలి పాల్గొననున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

వైభవంగా హనుమజ్జయంతి

- శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు

డోన్ రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని ఆంజనేయ స్వామి కొండపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు చేశారు. అలాగే మండలంలోని వెంకటాపురం, గుమ్మకొండ, చిన్నమల్కాపురం, ఎర్రగుంట్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె, శెట్టివీడు గ్రామాల రహదారుల్లోగల అభయాంజనేయస్వామి, చాగలమర్రి వీరాంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద పతాకావిష్కరణ చేశారు. ఆంజనేయ స్వామికి తమలపాకులతో పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కోలాట నృత్యం అందరిని ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా హనుమాన్ వ్రతాన్ని నిర్వహించారు.

కన్నులపండువగా హనుమాన్ శోభాయాత్ర

రుద్రవరం: రుద్రవరంలో కన్నులపండువగా హనుమాన్ శోభాయాత్ర గురువారం నిర్వహించారు. పడమటి వీధి నుంచి వీధుల గుండా కోలాటం బృందం భక్తిగీతాలతో శోభయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. కోలాట బృందం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే కొండమాయపల్లె, మందలూరు, నక్కలదిన్నె, వాసాపురం, ముత్తలూరు, మెట్ట ఇంకా పలు గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.

బేతంచెర్ల: హనుమజ్జయంతిని పురస్కరించుకుని బేతంచెర్ల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, పట్టణంలో మన ఊరు- మన గుడి, మన బాధ్యత ధార్మిక సంఘం ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్రను అత్యంత వైభవంగా గురువారం నిర్వహించారు. శోభయాత్రల సందర్భంగా గుంటూరు చెందిన సూరయ్య శ్రీరామ్ కళాబృందంతో అంజనేయస్వామి వేషాధారణ, మహిళల చేత నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. మన ఊరు - మన గుడి మన బాధ్యత సభ్యులతో పాటు వీహెచ్‌పీ సభ్యులు, హిందూ సోదరులు భక్తులు పాల్గొన్నారు. దీంతో వీధులన్నీ శోభాయాత్రలో భక్తులతో కిక్కిరిసాయి.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలో టీటీడీ, సమరసత, ఆర్ఎస్ఎస్, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యులు ఎనివాసులు, చంద్రశేఖరరెడ్డి, భవాని, జయరాముడు, రాముడునాయక్, లక్ష్మయ్య పలువురు ధార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు మండలంలోని వివిధ గ్రామాల్లోని హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు.

కనకాద్రిపల్లెలో గ్రామోత్సవం: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో హనుమజ్జయంతిని పురస్కరించుకొని స్వామి వారి గ్రామోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వీఆర్ లక్ష్మిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజనలతో స్వామి వారి ఉత్సవ మూర్తిని గ్రామ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, చంద్ర మోహన్‌గౌడ్, ఓబులేసు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని కొండపేట, రవ్వలకొండలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. కొండపేట ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రను అత్యంత శోభాయమానంగా నిర్వహించారు.

అవుకు: మండలంలోని ప్రజలు హనుమజ్జయంతిని ఘనంగా గురువారం జరుపుకొన్నారు. అవుకు పట్టణంలోని కోటవీధి, రాజవీధి, మార్కెట్ వీధి, సంజీవరాయుడు తోటలో వెలసిన ఆంజనే యస్వామి ఆలయాలతో పాటు, నిచ్చెనమెట్ల, ఉప్పలపాడు గ్రామాల్లో వెలసిన దేవాలయాల్లో అర్చకులు స్వాముల వారికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్యాపిలి: పట్టణంలోని మధ్యగేరి, వెంగన్నబావి ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్జునాపురం గ్రామంలోని కోదండరామాలయంలో వెలసిన అంజనేయుడికి తమలపాకులతో, వివిధ పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే కొండాపురం, దొర్నిపాడు, గుండుపాపల, దొర్నిపాడు గ్రామంలోని కాలువకట్ట సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల వద్ద తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డోన్ టౌన్: డోన్ పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని పాతపేట, ఇందిరానగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, ఆకు పూజలను పురోహితులు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు.

శిరివెళ్ల: మండలంలోని వెంకటాపురం, యర్రగుంట్ల, గుంప్రమాన్‌దిన్నె తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ప్రజలు గురువారం వైభవంగా జరుపుకొన్నారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. యర్రగుంట్ల గ్రామంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సంయుక్తంగా శ్రీరామసేన సహకారంతో హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా కోవెలకుంట్ల పట్టణంతోపాటు వెలగటూరు, గుంజలపాడు, గుల్లదుర్తి, భీమునిపాడు, కలుగొట్ల జోలదరాశి, రేవనూరు, చిన్నగొప్పెర్ల, వల్లంపాడు తదితర గ్రామాల్లో ప్రజలు హనుమజ్జయంతి నిర్వహించారు.

సంజామల: పేరుసోమల సమీపంలోని కోటపాడు ఆలయంలో కొలువుదీరనున్న పంచవతి అభయాంజనేయ స్వామికి గురువారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం ప్రాతఃకాల పూజ, జపపారా యణం, దేవతామూర్తులకు రుద్రభిషేకం, పంచవతి అభయాంజనే యస్వామికి మూలయంత్ర హోమం, మహాలక్ష్మి హోమం, మంగళహా రతి, అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



చాగలమర్రి: మూడురాళ్లపల్లె రహదారిలో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ప్రజలు



బేతంచెర్ల: శోభాయాత్రలో భక్తులను ఆకట్టుకుంటున్న ఆంజనేయస్వామి వేషధారణలో కళాకారుడు



రుద్రవరంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ఆళ్లగడ్డలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న పోలీసు అధికారులు



ప్యాపిలిలో ..



డోన్‌లో భక్తులకు అన్నదానం





నిచ్చెనమెట్ల, కోటపాడులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆమోదం పొందిన పనుల కొట్టివేత

- ఎంపీపీపై ఫిర్యాదు చేసిన ఎంపీడీవో
- విచారణ చేపట్టిన జిల్లా పరిషత్ సీఈవో

కోవెలకుంట్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండల తీర్మానం బుక్‌లో ఆమోదం పొందిన పనులను కొట్టివేసిన ఎంపీపీపై ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా పరిషత్ సీఈవో గురువారం కోవెలకుంట్ల ఎంపీడీవో కార్యా లయంలో విచారణ చేపట్టారు. సీఈవో నాసరరెడ్డి తెలిపిన వివరాలివీ.. గతంలో జరిగిన మండల సమావేశంలో సభ్యులు తీర్మానం చేసి కొన్ని పనులు చేపట్టేందుకు మండల బుక్‌లో ఆమోదం చేశారు. అందులో కోవెలకుంట్ల పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మండల గ్రాంటు నిధులతో పనులు చేపట్టడానికి తీర్మానం చేశారు. అయితే కోవెలకుంట్ల పట్టణంలో బనగానపల్లె రహదారిలో పెట్రోలు బంకు సమీపం నుంచి కుందూ వైన్స్ వరకు రూ.14లక్షలతో డ్రైనేజీ కాలువ పనులను చేప ట్టారు. ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవి, మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి మండల తీర్మానబుక్ ఇవ్వమని అడగడంతో ఆమోదం పొందిన తీర్మాన బుక్‌ను ఎంపీపీకి ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారన్నారు. అయితే తీర్మానం బుక్ తీసుకుని ఎంపీపీ కొట్టివేసి తిరిగి ఎంపీడీవోకు ఇచ్చారు, ఎంపీడీవో వరప్రసాదరావు తీర్మానం బుక్ తెరిచి చూసి ఆమోదం పొందిన పనులను కొట్టివేయడంతో ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎంపీడీవో ఫిర్యాదు మేరకు తాను గురువారం కోవెలకుంట్లకు వచ్చి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవిని, ఎంపీడీవోను, సిబ్బందితో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. అంతేకాక ఏం జరిగిందో వారితో ఓ లిఖితపూర్వక సంజాయిషీ లెటరు రాయించుకున్నామన్నారు. ఈ లెటరును పూర్తి స్థాయిలో చదివి విచారణ చేసి ఆమోదం పొందిన పనులను కొట్టివేసినందుకు బాధ్యులైన వారిపై పూర్తి స్థాయి విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఎంపీడీవో కార్యాలయంలో విచారిస్తున్న జడ్పీ సీఈవో

కౌలు రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఏవో రంగనేతాజీ

చాగలమర్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం, నేలంపాడు గ్రామాల్లో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏవో రంగనేతాజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కౌలురైతులు కౌలుకార్డు తప్పనిసరిగా పొందాలని సూచించారు. కౌలు కార్డు పొందిన రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రకృతి వల్ల నష్టం జరిగినప్పుడు పంటల బీమా, నష్టపరిహారం, బ్యాంకుల ద్వార రుణ సదుపాయం కూడా పొందవచ్చని, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తిస్తాయని అన్నారు. కౌలు కార్డుల కొరకు కౌలు రైతు ఆధార్, భూ యజమాని ఆధార్, పొలం పాసుపుస్తకం తీసుకొని వీఆర్వో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు కార్డు కాల వ్యవధి 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, కౌలు రైతులు పాల్గొన్నారు.

15వేల పాఠ్య పుస్తకాలు మంజూరు

చాగలమర్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 1 నుంచి 10 విద్యార్థులకు ఈ ఏడాది విద్యాసంవత్సరానికి గాను రూ.15,480 పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు ఎంఈవో న్యామతుల్ల గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 70 శాతం పుస్తకాలు వచ్చాయని, ఇంకా 30 శాతం పుస్తకాలు రావాల్సి ఉందని అన్నారు. 4914 మంది విద్యార్థులకు యూనిఫారమ్ మంజూరైందని అన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు కలిపి కిట్ల ద్వారపాఠశాలలకు అందజేస్తామని అన్నారు.

గాజులపల్లె డిపోకు కలప తరలింపు

రుద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్‌లోని అహోబిలం సెక్షన్ పరిధిలో ఉన్న టేకు ప్లాంటేషన్‌లో కింద పడిన టేకు వృక్షాల కలప గాజులపల్లె డిపోకు తరలించినట్లు రేంజర్ శ్రీపతినాయుడు గురువారం తెలిపారు. ఎగువ దిగువలో అహోబిలం మధ్యనున్న ఈ టేకు ప్లాంటేషన్‌లో గాలికి కింద పడ్డ వృక్షాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేకరించి డిపోకు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. రుద్రవరం డిపో ఖాళీగా ఉన్నందున ఇక్కడ తరలించ లేదన్నారు. గాజులపల్లె డిపో కలప వేలం కొనసాగుతుండడంతో అక్కడికి తరలించినట్లు రేంజర్ తెలిపారు.

పకడ్బందీగా భూ రీసర్వే

చాగలమర్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల చెరువు, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో భూరీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2 గ్రామాల్లో 7 టీమ్‌లతో భూరీసర్వే చేస్తున్నామని అన్నారు. నేలంపాడు గ్రామంలో మొదటి విడతగా రీసర్వే పనులు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో భూముల వివరాలను నమోదు చేస్తున్నామని అన్నారు. మండల సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగటూరు గ్రామంలో గ్రామ టీడీపీ నాయకుడు ధనుంజయుడు ఆధ్వర్యంలో గురువారం గ్రామస్థులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ధనుంజయుడు మాట్లాడుతూ గ్రామంలో గంగమ్మగుడి లేకపోవడంతో ఇబ్బందులు పడేవారన్నారు. అయితే గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.20లక్షలు వెచ్చించి నూతనంగా గంగమ్మ గుడి కట్టించి ఆదివారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుప్పిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గడ్డం విశ్వనాథరెడ్డి, పెద్దనాగ య్య రఘురామయ్య, పుల్లయ్య, బాబు, షేక్‌ఖాసిం, పల్లా లక్ష్మీనారా యణ, వెంకటేశ్, ముద్దం మాన్యం, తిమ్మరాజు, బంకు సురేశ్ పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవర ఏర్పాట్లపై డీఎస్పీ ఆరా



గోవిందిన్నెలో కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ

దొర్నిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బ్యా గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ దేవర సంబంధించిన ఏర్పాట్లపై డీఎస్పీ ప్రమోద్ గురువారం ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అంతకముందు పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 8, 9, 10 తేదీల్లో మూలపెద్దమ్మ దేవర నిర్వహణపై ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. 11 సంవత్సరాల తరువాత పెద్దమ్మ దేవర జరుగుతుండటంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీసు కంట్రోల్ రూమ్ ఎక్కడ ఏర్పాటు చేయాల్సింది అన్న విషయాలపై సీఐ మురళీధర్‌రెడ్డితో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు మిద్దె శంకరయ్య, చిన్నన్న, శ్రీను, చిన్నపెద్దన్న, మధు తదితరులు ఉన్నారు.